క్లుప్తంగా

ఫిజియోథెరపీపై అవగాహన



ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు కీర్తి

కాకినాడ రూరల్: వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని ఆ వైద్య నిపుణురాలు డాక్టరు కొత్త కీర్తి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఛాతి, గుండె, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగవైకల్యంతో పాటు క్యాన్సర్స్ వల్ల వచ్చే నొప్పులకు చక్కటి ఉపశమనం లభిస్తుందన్నారు. పెద్ద ఖర్చు లేకుండా వైద్యం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టరు ఆడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

మనిషి ప్రాణాల విలువ తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కాటన్

బోట్‌క్లబ్: మనిషి ప్రాణాల విలువ తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతతో ఉండాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కాటన్ పేర్కొన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మానసిక ప్రశాంతతపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో రోజురోజుకీ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. యువత మద్యంకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణం విలువ తెలుసుకుని ఆనందంగా జీవించాలని కోరారు. డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరైనా ఆత్మహత్యకి పాల్పడాలనుకున్నప్పుడు ఒక్కసారి తమ వాళ్లను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, చైతన్య, సిరాజ్, పద్మావతి, భవనీ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు అందిస్తున్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్

బోట్‌క్లబ్: సుదూర ప్రాంతాల నుంచి కాకినాడ వివిధ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లు అందించారు. స్థానిక బాలాజీ చెరువుసెంటర్‌లో ఉన్న పీఆర్ ప్రభుత్వం పాఠశాల్లో విద్యార్థులకు మంగళవారం సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ బస్‌పాస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమజ్యోతి, ఆర్టీసీ అధికారులు చినబాబు, వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేటలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇంధన సూర్యనారాయణ కుటుంబాన్ని హెల్పింగ్ టీమ్ సభ్యులు మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, 25 కిలోల బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీమ్ సభ్యులు రెడ్డి మణికంఠ, గంజా మణికంఠ, సూరంపూడి కుమార్, శ్రీపాదం వల్లిపద్మ పాల్గొన్నారు.

13న నెక్ సెంటర్‌లో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న నెక్ సెంటర్‌లో ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నెక్ జిల్లా అధికారి డి.హరిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 600 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బెల్, అపోలో ఫార్మసీ, డక్కన్ ఫైనాన్స్ కెమికల్, ఎస్‌కే సేఫ్టీ వింగ్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు బయోడెటా, గుర్తింపు కార్డు, తమ సర్టిఫికెట్లతో ఆరోజు ఉదయం 10 గంటకు హాజరు కావాలన్నారు. జీతం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94407 56250, 99491 56583 నవంబర్లకు సంప్రదించాలన్నారు.

ముంపు సమస్యకు మోక్షం

- జేఎన్‌టీయూకేలో సీసీ రోడ్లు, డ్రైన్ల ఏర్పాటు
- నాటి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న వర్సిటీ అధ్యాపక, విద్యార్థి సంఘాలు



సీసీ రోడ్లు నిర్మించడంతో పరిశుభ్రంగా ఉన్న వర్సిటీ ప్రాంగణం

బాలాజీచెరువు: వర్షం వస్తే చాలు అడుగు తీసి అడుగు వేసేందుకు అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఆర్థిక వనరులు ఉన్నా పట్టించుకునేవారు లేక అవస్థ తప్పేదికాదు. ఇప్పుడు ఆ సమస్యకు పుల్‌స్టాప్ పడింది. ఏటా వర్షాకాలంలో ముంపుబారిన పడే వర్సిటీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోక్షం లభించింది.

ఇబ్బందులకు చెక్

జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఏర్పాటై 15 ఏళ్లు పూర్తయింది. ఇక్కడ అపరిష్కృతంగా ఉన్న సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడేవారు. ముగ్గురు వీసీలు పని చేసినా ప్రధాన సమస్యపై దృష్టి సారించలేదు. ఆర్థిక వనరులు ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందనా ప్రణాళికలు, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకోకుండా అప్పటి వీసీలు కాలయాపన చేశారు. శంకుస్థాపనలు వంటి వాటితో కాలయాపన చేశారే తప్ప అభివృద్ధి వైపు అడుగు వేయలేదు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యపై స్పందించలేదు. కొద్దిపాటి వర్షం వస్తే వర్సిటీ చెరువును తలపించేది. ఇదే ఆవరణలో హాస్టల్ ఉండడంతో అక్కడ నుంచి తరగతులకు నడిచి వెళ్లడానికి నానా అవస్థలు పడేవారు. వర్షాకాలం అయితే సమస్య చెప్పనక్కర్లేదు. నగర నడి మధ్యలో దాదాపు 70 ఏకరాల పైబడి విస్తీర్ణంలో ఉన్న వర్సిటీలో వర్షాకాలం వస్తే సమస్యలు చెప్పనక్కర్లేదు. అధ్యాపకులతో పాటు దాదాపు 2 వేల మంది విద్యార్థులు, 700 మంది నాన్ టీచింగ్ సిబ్బందితోపాటు వివిధ పనులపై వర్సిటీకు వచ్చేవారు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆ అవస్థలకు చెక్ లభించింది.



2021లో రోడ్డు లేక కొద్దిపాటి వర్షానికే వర్సిటీ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నిత్యం దోమలతో..

వర్సిటీ ఆవరణలో ఉన్న అధ్యాపకుల క్వార్టర్స్ వద్ద నీరు నిలిచిపోవడంతో దోమల సమస్యతో నిత్యం నరకం చూసేవారు. నాగవళి, మహిళ హాస్టల్స్, పోస్టల్ కార్యాలయం పక్కన ఇలా ప్రతి ప్రాంతం నీటితో నిలిచిపోయి వర్షం పోయిన పది పదిహేను రోజుల వరకూ నీరు ఇంకిపోవాలే తప్ప బయటకు పోయే మార్గం లేదు. వర్షపు నీటితో వర్సిటీ ఆవరణమంతా నిండిపోయేది. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు విద్యార్థులకు కంటి మీద కునుక లేకుండా ఉండేది.

ప్రత్యేక శ్రద్ధతో..

దాదాపు 25 ఏళ్ల పాటు ఇదే కళాశాలలో వివిధ ప్రొఫెసర్ స్థాయి నుంచి వివిధ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ఉన్నత స్థాయి అధికారులతో పలు మార్లు సంప్రదించి 2022లో దాదాపు రూ.20 కోట్లతో రోడ్లు డ్రైనేజీలకు ప్రతిపాదనలతో పాటు టెండర్ల ప్రక్రియ వెంటనే పూర్తి పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు.

> **పనుల్లో నిర్లక్ష్యం లేకుండా..**
>
> 
>
> వర్షాకాలం వస్తే నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరు కొద్దిపాటి వర్షానికే మునిగిపోయేది. ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణాలతో పాటు సీసీ రోడ్లు ఎత్తుగా నిర్మించడంతో నీరు నిలవడం లేదు. వర్సిటీలో చేపడుతున్న పనులు నిర్లక్ష్యం లేకుండా త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నాం.
>
> – వి.శ్రీనివాసులు, ఛీఫ్ ఇంజినీర్, జేఎన్‌టీయూకే

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. రూ.9 వేల కోట్ల పెట్టుబడికి రూ.58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆందోళనకారులు విమర్శించారు. దీనిలో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుంచి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందన్నారు. దీంతో అనివార్యంగా నష్టాలలోకి విశాఖ ఉక్కును నెట్టాలని బీజేపీ మోదీ ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు చేయించాలని డిమాండ్ చేశారు. సొంత ఘనులు విశాఖ ఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 మంది ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలు సిద్ధంగా లేరన్నారు. అవసరమైతే మరో అంతిమ పోరాటానికి సిద్ధపడతామని ఆందోళనకారులు హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి, చెక్కల రాజ్‌కుమా, మలకా రమణ, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, అనపర్తి ఏడుకొండలు, వై శ్రీను, శ్రీహరి, సత్యనారాయణ, బలరాం, రామిరెడ్డి, దొరబాబు, రాణి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

చీకటి జీవోను రద్దు చేయండి



జీజీహెచ్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు నర్సులు

కాకినాడ క్రైం: కాంట్రాక్టు నర్సుల భవిష్యత్‌ను చీకటిమయం చేసే జీవో 115ను తక్షణమే రద్దు చేయాలని నినదిస్తూ కాకినాడ జీజీహెచ్‌లోని కాంట్రాక్టు నర్సులు గళమెత్తారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలోని పోర్టికో వద్ద రిలే దీక్ష నిర్వహించారు. జీవో 115కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు మామిడి చిన్నారి మాట్లాడుతూ, వారం రోజుల క్రితం ప్రవేశపెట్టిన 115 జీవో కాంట్రాక్టు నర్సుల భవితను చీకటిమయం చేయనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మందికి ఉద్యోగాలిచ్చామని చెప్పుకునేందుకు అర్హులైన వారిని, వారి సేవలను విస్మరించి భవితను చిదిమేస్తున్నారన్నారు. ఏఎన్ఎంలకు నామమాత్రపు శిక్షణనిచ్చి స్టాఫ్ నర్సులుగా శాశ్వత ప్రాతిపదికన పోస్టింగులు ఇస్తున్నారన్నారు. రెగ్యులరైజేషన్ కోసం ఎన్నో ఏళ్లు ఎదురు చూస్తున్న మా భవిష్యత్ ఏంటని ప్రశ్నించారు. రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా శ్రమిస్తూ, పదిహేనేళ్లకుపైగా అరకొర జీతాలలో ఉద్యోగం చేస్తున్న తమను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. దశల వారీ నిరసనలో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు విధులు కొనసాగిస్తూ నిరసన తెలియజేస్తామన్నారు. 13వ తేదీ నుంచి అత్యవసర సేవలు మినహాయించి విధులు బహిష్కరణ చేపట్టనున్నట్టు చిన్నారి తెలిపారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని రావికంపాడు, ఏవీ నగరం గ్రామాల్లో మంగళవారం వంట గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన కళాకారులు వీర్నాల కృష్ణ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి

శంఖవరం: వరిలో తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆకుముడత పురుగు వరిపంటను ఆశిస్తే తాడు లేదా ముల్ల కంపతో లాగడం వలన లార్వాలు, గుడ్లు నీటిలో పడి చనిపోతాయన్నారు.

జాతీయ ఓపెన్ యోగాలో డీఎస్‌ఏ క్రీడాకారుల ప్రతిభ



యోగా పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదిత్య సాయి యోగా సెంటర్, శివజ్యోతి యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన బీకేఎస్ అయ్యంగార్ 8వ జాతీయ ఓపెన్ యోగా చాంపియన్‌షిప్‌లో కాకినాడ డీఎస్‌ఏ క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించినట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. బొజ్జా లక్ష్మీవెంకట సాయి ప్రథమ స్థానం, ఎల్.సుచిస్మిత, కె.శ్రీనేత్ర ద్వితీయస్థానం, విశ్వనాథం యశ్మిత 5వ స్థానం, కె.అలేఖ్య, కె.గంగ ఇషాంత్ 6వ స్థానం, ఎం.అజిత్‌ఆదిత్య వర్మ కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారన్నారు. వీరందరూ డీఎస్‌ఏ యోగా కోచ్ రాజు వద్ద శిక్షణ పొందుతున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పి.దొర, జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ అభినందించారు.


లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ ఏర్పడి 60ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో లయన్స్ డైమండ్స్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్టు లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పెద మార్కెట్ మున్సిపల్ పాఠశాలకు ముఖద్వారా నేమ్‌బోర్డు ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది పొడవున డైమండ్ జూబ్లీ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పులవర్తి కుమార్, సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలో కురసాంపేట వద్ద అక్రమంగా పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆర్ఏఓ మునిస్వామికి స్థానిక సుంకర స్వామినాయుడు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుంకర కార్తీక్, మాగాపు సుబ్బారావు తదితరులు ఫిర్యాదు చేశారు. ఆఖరికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సైతం బేఖాతర్ చేస్తున్నారని, వెంటనే ఇసుక తవ్వకాలను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. దళారులను అరికట్టి పేదలకు ఇసుక అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



సుంకరపాలెం జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ మద్యం మత్తులోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదం జరిగినపుడు ప్రాణనష్టం, దీర్ఘకాల వైకల్యాలు సంభవిస్తే ఆ కుటుంబాలు కోలుకోలేని పరిస్థితికి వెళుతున్నాయన్నారు. యువత మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబు నిర్వాకం వల్లే కన్నీటి కష్టాలు

- వైఫల్యానికి కూటమి ప్రభుత్వానిదే బాధ్యత
- కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి



ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా విజయవాడ ప్రజలు ఎదుర్కొన్న నరకయాతనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిర్వాకమే కారణమని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముంపు సమస్యతో ప్రజలు అల్లాడుతున్నప్పటికీ వారికి అవసరమైన ఆహారం, మంచినీరు కూడా అందించలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ప్రచార ఆర్భాటం కోసం వ్యవహరించిన తీరు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారన్నారు. తన ప్రచార పిచ్చితో వరద ముంపు ప్రాంతాల్లో తిష్టవేసి రోజు గంటల తరబడి సమీక్షలు చేయడం, అధికార యంత్రాంగాన్ని తన చుట్టూ తిప్పుకోవడం మినహా ప్రజల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనుభవజ్ఞులైన ఐఏఎస్ అధికారులు, ఇతర యంత్రాంగంతోపాటు 500 నుంచి 1000 మంది బాబు సేవలోనే తలమునకలయ్యారన్నారు. ఖమ్మం వంటి ప్రాంతాల్లో కూడా ఇదే తరహా సమస్య ఉత్పన్నమైనప్పటికీ అక్కడి సీఎం ఆ ప్రాంతంలో పర్యటించి ఆ తరువాత అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ సమస్యను పరిష్కరించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అందుకు పూర్తి భిన్నంగా చంద్రబాబు బస్సులోనే తిష్టవేసి మొత్తం యంత్రాగాన్ని తన కనుసన్నల్లో పెట్టుకుని సహాయక చర్యలకు అడుగడుగునా అవరోధం కలిగించారన్నారు. బాబు ప్రచారం కోసం విజయవాడ ముంపును స్వలాభవం కోసం వాడుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితికి కూటమి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ద్వారంపూడి పేర్కొన్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తంకండి

కమిషనర్ భావన అధికారులకు ఆదేశం



డ్రైన్‌లో గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: వరదనీటి ఉధృతిని అంచనా వేస్తూ ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. భారీ వర్షాలతో గాడేరు, బిక్కవోలు డ్రైన్లు, కాలువల్లో వరద నీరు పోటెత్తే సూచనలు ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహాన్ని కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. నగరానికి అనుసంధానంగా సర్పవరం భావన్నారాయణ స్వామి గుడి వద్ద, జనచైతన్య నగర్ బ్రిడ్జి, ప్రతాప్‌నగర్ గాడేరు డ్రైన్ పాయింట్లతో పాటు తూర్పు ఏలేరు డ్రైన్, బిక్కవోలు డ్రైన్లను పరిశీలించారు. వరదనీటి ప్రభావం కాకినాడ నగరానికి లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే డ్రైన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ డ్రైన్లలో వరదనీటిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కమిషనర్ వెంట ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్ తదితర అధికారులు ఉన్నారు.

గణేశ్ నిమజ్జనం జయప్రదం చేయాలి

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో వినాయక సాగర్‌లో వాహనాల ప్రవేశం లేకుండా 3 అడుగుల లోపు గణపతి విగ్రహాల నిమజ్జనం జయప్రదం చేయాలని నగర గణేశ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు కోరారు. మూడు అడుగులకు మించిన విగ్రహాలను వన్ టౌన్ రోడ్ పోర్ట్ జెట్టి వద్ద నిమజ్జనం జరుగుతుందన్నారు. గాంధీ నగర్ పెద్ద మార్కెట్, జగన్నాథపురం, పేర్రాజుపేట, దేవాలయం వీధి ప్రాంతాల్లో గణేశ మండపాల నిర్వాహకులను సమితి సభ్యులు మంగళవారం ఆహ్వానించారు. నగరంలో 65 భారీ విగ్రహాలు, 128 చిన్న విగ్రహాలు, 3 అడుగుల విగ్రహాల 52 ఉన్నాయని అతి చిన్న విగ్రహాలు 422 ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిటీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, సమితి సభ్యులు మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, చేదులూరి గవరయ్య పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ విజయ గణపతి

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక పంచామృతాభిషేకం చేశారు. దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరింటెంటెంట్ కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, భక్తులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్లకు అన్యాయం

సామర్లకోట: జూనియర్ డాక్టర్లకు అన్యాయం జరిగేలా ఉన్న జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సమ్మెకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపు మేరకు తమ సమస్యలపై బుధవారం నుంచి పోరాటం చేయనున్నట్టు వైద్యులు తెలియజేశారు. మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. జీఓ 85 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. గత రెండు నెలలుగా జీఓ రద్దు చేయమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి సమాధానం రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆందోళన చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు ఆ సంఘ నాయకులు తెలిపారు. 11, 12 తేదీల వరకూ చర్చల కోసం ఎదురుచూస్తామని, 13న ప్రభుత్వం నుంచి చర్చలు లేకపోతే పీహెచ్‌సీల్లో అత్యవసర సరీ్వసులు మినహాయించి, అన్ని సేవలు నిలిపివేస్తామన్నారు. 14న అత్యవసర సేవలకు మాత్రమే ఉంటాయని, 15న చలో విజయవాడ ర్యాలీ డైరెక్టరు ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద జరుగుతుందని చెప్పారు. 16 నుంచి జీఓ 85 రద్దు చేసే వరకు నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమవుతుయని వివరించారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



తాళ్లరేవులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: తాళ్లరేవు సెక్టార్ పరిధిలోని రత్నవారిపేట, గాడిమొగ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి పర్యవేక్షణలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రదర్శించి, పౌష్టికాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని పరదేశమ్మ వీధి, తాళ్లరేవు కేంద్రాల్లో కలర్స్ డే నిర్వహించారు. గ్రీన్ డేలో భాగంగా తల్లులందరూ ఒకే రంగు కలర్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.నిభావాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకుమారి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, భవాని, సునీత, సత్యనారాయణమ్మ, సుబ్బలక్ష్మి, వేణు, భారతి, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పెన్షన్ స్కీమ్ అమలుచేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్)ను అమలు చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రభుత్వానికి మంగళవారం విజ్ఞప్తి చేసింది. పుదుచ్చేరి ప్రభుత్వ సొసైటీ కాలేజ్ స్టాఫ్(టీచింగ్ అండ్ నాన్ టీచింగ్) జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను ప్రభుత్వ ఉద్యోగులు, కొన్ని అటానమస్ సంస్థల్లోని ఉద్యోగులకు అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. అయితే సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల సిబ్బందికి సైతం దాన్ని వర్తింపజేయాలని కోరారు. ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు కేవలం కాంట్రిబ్యూటరీ ప్రావిడెంట్ ఫండ్ మాత్రమే కవర్ అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ప్రకటించిందని, ఇది 50 శాతం పెన్షన్ గ్యారంటీ ఇస్తుందన్నారు. అయితే ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు మాత్రమే యూపీఎస్‌ని ఎంచుకోవచ్చన్నారు. మున్సిపాలిటీలు, పంచాయితీల తరహాలో సొసైటీల ఆధ్వర్యంలో నడిచే కాలేజీలకు ఎన్‌పీఎస్‌ను విస్తరించాలని కమిటీ కోరిందన్నారు. యానాం, పుదుచ్చేరి, కారైకల్‌లో పాండిచ్చేరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టుమెట్రిక్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి సైతం సిబ్బంది హాజరయ్యారని చెప్పారు.